సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

సోమవారం | 25 | ఆగస్టు | 2025



కాజీపేట రైల్వేడిపోకు పూర్వవైభవం

కాజీపేట జంక్షన్‌లోని రన్నింగ్ డిపోకు పూర్వవైభవం రానుంది. దసరా కానుకగా 190 పోస్టులకు అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

- 8లో▸



గూడ్స్ షెడ్‌కు భారీగా ఎరువులు

వరంగల్ రైల్వేస్టేషన్ గూడ్స్‌షెడ్‌కు ఆదివారం కోరమండల్ కంపెనీకి చెందిన ఎరువులు భారీగా వచ్చాయి.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$31^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండగా ఉంటుంది. మధ్యాహ్నం వాతావరణం సాధారణంగా ఉంటుంది. సాయంత్రం పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముగిసిన చదరంగం పోటీలు



వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగం సమాఖ్య ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం జిల్లాస్థాయి మూడో ర్యాంకింగ్ చదరంగ పోటీలు ముగిశాయి. ముఖ్య అతిథిగా ఎస్‌బీటీ టెక్నికల్ ఆఫీసర్ సుధాకర్ హాజరై విజేతలకు సర్టిఫికెట్లు, పతకాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరిగేసి అర్జున్‌ను స్ఫూర్తిగా తీసుకుని చదరంగంలో రాణించాలని సూచించారు. నిర్వహణ కార్యదర్శి పి.కన్నా మాట్లాడుతూ అండర్-7,9,11,13,15 బాలబాలికల విభాగాల్లో పోటీలకు జిల్లా వ్యాప్తంగా 70 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్లు ప్రేమ్‌సాగర్, వైశాలి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అధిక ధరలకు సరుకులు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు

ఖిలా వరంగల్: వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్ వ్యాపారులు, వర్తక సంఘం ప్రతినిధులు టెండర్ పేరుతో సరుకులను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని మార్కెట్ కార్యదర్శి గుగులోత్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్‌కు వచ్చే రైతులు, వినియోగదారులతో ఏజెంట్లు నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి



విద్యారణ్యపురి: జిల్లాలోని ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిశాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ డీఈఓ కార్యాలయంలో టీపీటీఎఫ్ బాధ్యులతో కలిసి సత్యనారాయణ సూపరింటెండెంట్ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎం.రఘుపతి, జిల్లా మాజీ అధ్యక్షుడు బీమళ్ల సారయ్య, జిల్లా బాధ్యులు రవి, రాజు, సదానందం పాల్గొన్నారు.

నేడు 'గ్రేటర్' గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: జీడబ్ల్యూఎంసీ గ్రీవెన్స్‌ను సోమవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సమస్యలపై రాత పూర్వకంగా దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజావాణి

న్యూశాయంపేట: ప్రజల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో సోమవారం(నేడు) ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు అందించాలని సూచించారు.

గణపతి రుద్రుడిగా రుద్రేశ్వరస్వామికి అలంకరణ



హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయంలో భాద్రపద మాసం శుద్ధ పాడ్యమి ఆదివారం శ్రీరుద్రేశ్వరస్వామి వారిని గణపతి రుద్రుడిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు గంగు మణికంఠశర్మ, అర్చకులు పానుగంటి ప్రణవ్, పెండ్యాల సందీప్‌శర్మ పూజలు నిర్వహించారు.

డీఈఈ సెట్ స్పాట్ అడ్మిషన్లు

విద్యారణ్యపురి: డైట్ కళాశాలల్లో ప్రవేశాలకు డీఈఈ సెట్ అభ్యర్థులకు స్పాట్ అడ్మిషన్ల రెండో దశ ప్రక్రియ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ వరంగల్, హనుమకొండ ప్రిన్సిపాల్ ఎండీ అబ్దుల్‌హై ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా డీఈఈసెట్-2025లో అర్హత సాధించి ఉండాలని, ప్రభుత్వ డైట్ కళాశాలల్లో ఈనెల 26న, ప్రైవేట్ కళాశాలల్లో ఈనెల 28న స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. సీట్లు పొందిన వారు ఈనెల 29న ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంబంధిత కళాశాలల్లో రిపోర్టు చేయాలని ఆయన సూచించారు.

కేఎంఛీ!

అపరిశుభ్రంగా కాకతీయ వైద్య కళాశాల వసతి గృహాలు

- వేతనాల కోసం 13 రోజులుగా విధులు బహిష్కరించిన కార్మికులు
- హాస్టళ్ల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం
- కుక్కలు, పాములు, దోమలు, ఈగలతో మెడికోల ఇబ్బందులు
- 20 మందికిపైగా విషజ్వరాలు.. ఒకరికి డెంగీ పాజిటివ్
- సమస్య పరిష్కరించలేక చేతులెత్తేసిన పరిపాలనాధికారులు



కేఎంసీ ప్రాంగణంలోని వసతి గృహాలు



వసతి గృహంలోకి వచ్చిన పాము



పేరుకుపోయిన చెత్తాచెదారం



హాస్టల్ ఆవరణలో కోతి

ఎంజీఎం: దశాబ్దాల చరిత్ర కలిగిన కాకతీయ వైద్య కళాశాల దుర్గంధానికి నెలవుగా మారింది. దీంతో వసతి గృహాల్లో ఉండేందుకు వైద్య విద్యార్థులు జంకుతున్నారు. వేతనాలు రావడం లేదని 13 రోజులుగా పారిశుద్ధ్య కార్మికులు విధులు బహిష్కరించి ఆందోళన బాట పట్టారు. కేఎంసీ బాలుర హాస్టళ్లలోని ఐదు భవనాలు, బాలికల హాస్టళ్లలోని ఐదు భవనాల్లో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు నిలిచిపోయాయి. ఎక్కడ చూసినా చెత్తాచెదారం దర్శనమిస్తోంది. వ్యర్థాలు పేరుకుపోవడంతో కుక్కలు వసతి గృహాల వైపు వస్తున్నాయి. ఈగలకు, దోమలకు ఆవాసంగా మారాయి. దుర్వాసన వెలువడడంతోపాటు బాత్‌రూంలు సైతం అధ్వాన స్థితికి చేరుకున్నాయి. వైద్య విద్యార్థులు ప్రస్తుతం హాస్టళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో 20 మంది మెడికోలు విషజ్వరాల బారిన పడ్డారు. ఇద్దరు పీజీ విద్యార్థులు డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోగా.. ఒకరికి పాజిటివ్ వచ్చింది. వీరు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

హాస్టళ్లలో అధ్వాన పరిస్థితి..

కాకతీయ వైద్య కళాశాలలో 1250 మంది విద్యార్థులు ఎంబీబీఎస్, అందులో 750 మందికిపైగా పోస్ట్ గ్రాడ్యుయేట్ చదువుతున్నారు. మొత్తం 1200 మంది విద్యార్థులకుపైగా కేఎంసీలోని హాస్టళ్లలో నివాసముంటున్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ సభ్యుల నిబంధనల మేరకు 75 శాతం మంది వైద్య విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలనే నిబంధన సైతం ఉంది. నిబంధనల ప్రకారం 75 శాతం కంటే ఎక్కువగానే విద్యార్థులు హాస్టళ్లలో ఉంటున్నారు. ఈ మేరకు విద్యార్థులకు పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా కేఎంసీలోని హాస్టళ్లలో పనిచేసేందుకు 85 మంది కార్మికులను ప్రభుత్వం నియమించింది. అయితే, వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు సమ్మె బాట పట్టారు. ఈక్రమంలో 13 రోజులుగా పారిశుద్ధ్య పనులు చేసే వారు లేక హాస్టళ్లలోకి కుక్కలు, పాములు సైతం వస్తున్నాయి. దీంతో వ్యాధులు విజృంభిస్తున్నాయి. హాస్టళ్లలో ఉండేందుకు వైద్య విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. సమస్యలు పరిష్కరించలేక కేఎంసీ పరిపాలనాధికారులు చేతులెత్తేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కలుషిత నీటిసరఫరా..

వందలాది మంది విద్యార్థులు ఉండే హాస్టళ్లు అపరిశుభ్రంగా మారాయి. నీటిని సరఫరాచేసే వాటర్ ట్యాంకులు సైతం శుభ్రంగా లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజువారీ అవసరాలకు వాడుకునే నీరు సైతం కలుషితం కావడంతో నరకయాతన అనుభవించాల్సి వస్తోంది. ఆర్‌ఓ ప్లాంట్లను సైతం విద్యార్థులే నిర్వహిస్తూ తాగునీటిని పొందాల్సిన దుస్థితి నెలకొంది.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి..



హాస్టళ్లలో ఎక్కడ చూసినా చెత్తచెదారమే కనిపిస్తోంది. పరిసరాలు అపరిశుభ్రంగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. వాటర్ ట్యాంకులను సైతం శుభ్రం చేయట్లేదు. కలుషిత నీటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

- నవీనత్, వైద్య విద్యార్థి

హాస్టళ్లు వదిలివెళ్లే పరిస్థితి ఉంది..



పారిశుద్ధ్య కార్మికుల సమ్మె మరో రెండు మూడు రోజులు ఇలాగే కొనసాగితే హాస్టళ్లు వదిలివెళ్లే పరిస్థితి ఉంటుంది. సుదూర ప్రాంతాల నుంచి వైద్యవిద్య కోసం వచ్చిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే అధికారులు ఈ సమస్యకు పరిష్కారం చూపాలి.

- లోకేశ్, మెడికో

ఎస్‌జీటీలకు ఎస్‌ఏలుగా పదోన్నతి

- సీనియార్టీ జాబితాల విడుదల
- నేడు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం



విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా తత్సమానమైన పీఎస్ హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించే ప్రక్రియలో భాగంగా సీనియారిటీ జాబితా వెల్లడించారు. తొలుత 1:3 నిష్పత్తిలో సీనియారిటీ జాబితా వెల్లడించి అభ్యంతరాలు స్వీకరించారు. ఆదివారం 1:1 సీనియారిటీ జాబితా ప్రకటించారు. అందులో కూడా ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తున్నారు. ఈనెల 25న వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం కల్పించనున్నారు. ఈనెల 26న పదోన్నతులు పొందిన వారికి ఉత్తర్వులు ఇవ్వనున్నారు. జిల్లాలో 147 ఎస్‌ఏల పోస్టులు ఖాళీగా చూపారు. అయితే, వివిధ కేటగిరీల్లో పదోన్నతులకు అర్హులైనవారు లేరు. అందులో 105 స్కూల్‌అసిస్టెంట్ పోస్టుల్లో ఎస్‌జీటీలకు పదోన్నతి కల్పించనున్నారు.

వరంగల్ జిల్లాలో..

వరంగల్ జిల్లాలో ఎస్‌జీటీలకు ఎస్‌ఏలుగా పదోన్నతుల ప్రక్రియకు సంబంధించి సీనియారిటీ జాబితా వెల్లడించడంలో జాప్యం జరిగింది. ఆదివారం 1:3 నిష్పత్తిలో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా వెల్లడించారు. అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. మరోవైపు తుది జాబితాపై కూడా డీఈఓ కార్యాలయంలో సిబ్బంది కసరత్తు చేస్తున్నారు. 1:1 నిష్పత్తిలో సీనియారిటీ జాబితా సోమవారం వెల్లడించనున్నట్లు ఇన్‌చార్జ్ డీఈఓ రంగయ్యానాయుడు తెలిపారు. అదేరోజు ఉపాధ్యాయులకు వెబ్‌ఆప్షన్లకు అవకాశం ఇస్తారని భావిస్తున్నారు. జిల్లాలో పదోన్నతులకు 122 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు వేకెన్సీలుగా ఉన్నాయి.

ర్యాగింగ్‌కు పాల్పడితే క్రిమినల్ చర్యలు

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



వరంగల్ క్రైం: విద్యాసంస్థల్లో ఎవరైనా విద్యార్థులు ర్యాగింగ్ వంటి వికృత చేష్టలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ హెచ్చరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ర్యాగింగ్ నియంత్రణపై పోలీస్ కమిషనర్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడడం అనేది తీవ్రమైన నేరమని, ఈ చర్యలతో విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు. ర్యాగింగ్ నియంత్రణకు యాజమాన్యాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఇందులో భాగంగా యాంటీ ర్యాగింగ్ కమిటీలు, స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని, నూతనంగా వచ్చిన విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని ఆయన సూచించారు. ముఖ్యంగా ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన సదస్సులు, వర్క్‌షాపులు నిరంతరం నిర్వహించాలని, విద్యార్థులు ఫిర్యాదు చేసేందుకు 24గంటల హెల్ప్‌లైన్ నంబర్లను విద్యాసంస్థల యాజమాన్యం అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఎవరైనా ర్యాగింగ్‌కు గురైతే తక్షణమే ప్రిన్సిపాల్, యాజమాన్యం, పోలీసులకు సమాచారం అందించాలని సీపీ కోరారు. విద్యాసంస్థల యాజమాన్యాలు, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసులు కలిసి పనిచేసినప్పుడే ర్యాగింగ్ సంస్కృతిని పూర్తిగా నిర్మూలించగలమని పోలీస్ కమిషనర్ తెలిపారు.

ఎఫ్‌ఏసీ డీఈఓగా రంగయ్యానాయుడు బాధ్యతల స్వీకరణ

- సన్మానించిన ఉద్యోగులు



రంగయ్యానాయుడిని సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

విద్యారణ్యపురి: వరంగల్ ఫుల్ అడిషనల్ చార్జ్(ఎఫ్‌ఏసీ) డీఈఓగా పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రంగయ్యానాయుడు ఆదివారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 23న కలెక్టర్ సత్యశారద వరంగల్ ఎఫ్‌ఏసీ డీఈఓగా రంగయ్యానాయుడును నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. అయితే ఆయన డీఈఓగా విధుల్లో చేరేందుకు తొలుత విముఖత వ్యక్తం చేశారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో డీఈఓగా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ సుజన్‌తేజ, సూపరింటెండెంట్లు బాబ్జి, జ్యోతి, ఏఎస్‌ఓ వేణుగోపాల్, టీ ఎన్జీఓ జిల్లా ఉపాధ్యక్షుడు రామానుజం, జగదీశ్వర్ ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు. రంగయ్యానాయుడికి హనుమకొండ జిల్లా, వరంగల్ జిల్లా ఎఫ్‌ఏసీ డీఈఓగా గతంలో బాధ్యతలు నిర్వర్తించిన అనుభవం ఉంది.


ఓపెన్ డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ వై.వెంకటేశ్వర్లు, కో–ఆర్డినేటర్, అధ్యాపకులు

విద్యారణ్యపురి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఈవిద్యాసంవత్సరం 2025–26లో డిగ్రీ, పీజీ ప్రవేశాలు పొందాలని ఆ యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లు కోరారు. డిగ్రీ, పీజీ కోర్సుల ప్రవేశాల ప్రక్రియలో భాగంగా ఆదివారం వెంకటేశ్వర్లు ఆ యూనివర్సిటీ సెంటర్ ఫర్ స్టాఫ్ ట్రైనింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటరమణతో కలిసి హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీల అధ్యయన కేంద్రాలను వేర్వేరుగా సందర్శించారు. ప్రవేశాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలు పొందే విద్యార్థులకు రిటైలర్స్ అసోసియేషన్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ద్వారా పారిశ్రామిక రంగంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని వెల్లడించారు. విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. ఈ నెల 30 వరకు అడ్మిషన్లకు గడువు ఉందని తెలిపారు. పూర్తి వివరాలకు అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు. కేడీసీలో పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో కేడీసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ అలువాల సంజీవయ్య, అధ్యాపకులు డాక్టర్ బి.వెంకట గోపీనాథ్, ఎం.సదానందం, సురేశ్, పూర్ణచందర్, దుర్గం రవి, రమేశ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్పోర్ట్స్ డే రన్



జెండా ఊపి రన్‌ను ప్రారంభిస్తున్న డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్: హాకీ క్రీడా దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని హనుమకొండ డీఎస్‌ఏ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్పోర్ట్స్‌డే రన్‌లో యువత, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వద్ద డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్ కుమార్ జెండా ఊపి రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యాన్‌చంద్‌ను స్మరించుకుంటూ ఈ నెల 31వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రన్ స్టేడియం నుంచి అంబేడ్కర్ విగ్రహం మీదుగా తిరిగి స్టేడియానికి చేరుకుంది. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్, డీఎస్‌ఏ కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

బార్బరిక్ చిత్ర బృందం సందడి



ఏషియన్ మాల్‌లో సందడి చేస్తున్న చిత్రబృందం

హన్మకొండ చౌరస్తా: స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పణలో వానర సెల్యూలాయిడ్ బ్యానర్‌పై విజయ్‌పాల్‌రెడ్డి అడిదెల నిర్మించిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్' చిత్ర బృందం నగరంలో సందడి చేసింది. ఈనెల 29న విడుదల కానున్న బార్బరిక్ సినిమా స్పెషల్ ప్రీమియర్ షోను ఆదివారం హనుమకొండలోని శ్రీదేవీ ఏషియన్‌మాల్‌లో ప్రదర్శించారు. షో కు విచ్చేసిన దర్శకుడు మోహన్ శ్రీవాత్సవ, నిర్మాత విజయపాల్‌రెడ్డి, నటి ఉదయభాను, నటీనటులు వశిష్ఠ, ఎస్.సింహా, సత్యం రాజేశ్, క్రాంతికిరణ్, సాంచీరాయ్ సినిమా ఎలా ఉందో ప్రేక్షకులను అడిగి తెలుసుకున్నారు. చిన్న సినిమాలను ఆదరించాలని కోరారు.

సినిమా చూసిన ఎమ్మెల్యే నాయిని

స్పెషల్ ప్రీమియర్ షో కు హాజరైన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, చిత్ర బృందంతో కలిసి కాసేపు సినిమాను తిలకించారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి వెంట కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకుడు తోట పవన్, వద్దిరాజు వెంకటేశ్వర్లు, కరాటే ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'జనహిత'కు సిద్ధం!

వర్ధన్నపేటలో నేడు కాంగ్రెస్ నేతల పాదయాత్ర

- పాల్గొననున్న కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్
- ఏర్పాట్లపై ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధుల సమీక్షలు
- ఇల్లంద నుంచి వర్ధన్నపేట టౌన్ వరకు పాదయాత్ర
- సభకు ఏర్పాట్లు చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- హాజరుకానున్న పీసీసీ చీఫ్, మంత్రులు, ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

సాక్షి, వరంగల్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేపట్టిన జనహిత పాదయాత్రకు జిల్లాలో ఏర్పాట్లు చేశారు. సోమవారం సాయంత్రం 4:30 నుంచి ఇల్లంద మార్కెట్ నుంచి వర్ధన్నపేట టౌన్ అంబేడ్కర్ సెంటర్ వరకు, అనంతరం కార్నర్ మీటింగ్ ఉంటుంది. దాదాపు మూడు కిలోమీటర్ల మేర సాగనున్న ఈ పాదయాత్రలో ఉమ్మడి జిల్లామంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఇన్‌చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఉమ్మడి జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఉమ్మడి జిల్లాకు తొలిసారి రానున్న నేపథ్యంలో ఆమె పాదయాత్రను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టుదలతో ఉన్నారు. జనహిత పాదయాత్ర ఇన్‌చార్జ్‌లు ఎమ్మెల్సీ శంకర్ నాయక్, పులి అనిల్, జూలూరి ధనలక్ష్మి, టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, నమిండ్ల శ్రీనివాస్, బొంతు రామ్మోహన్, పీసీసీ ప్రధాన కార్యదర్శులు దుద్దిళ్ల శ్రీనుబాబు, పల్లె శ్రీనివాస్‌గౌడ్, మోత్కూరి ధర్మారావు, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావుతో పాటు కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు క్షేత్రస్థాయిలో పర్యటించి పాదయాత్ర ఏర్పాట్లపై మార్గదర్శనం చేస్తున్నారు. ఇప్పటికే హనుమకొండలోని డీసీసీ భవన్‌లో కూడా పార్టీ ఇన్‌చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో పాదయాత్ర ఏర్పాట్లతో పాటు అది విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు కలిసి రావాలని పిలుపునిచ్చారు.

స్వచ్ఛందంగా తరలిరావాలి..

కాంగ్రెస్ పార్టీలో ఉన్న అన్ని విభాగాల శ్రేణులు స్వచ్ఛందంగా వేలాదిగా తరలివచ్చి రెండో విడత జనహిత పాదయాత్రని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పార్టీ ముఖ్యనాయకులకు దిశానిర్దేశం చేశారు. వర్ధన్నపేటటౌన్‌లోని ఎమ్మెల్యే అధికార క్యాంప్ కార్యాలయంలో ముఖ్య అతిథిగా వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ పీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్‌తో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తలతో ఆదివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. అంతకుముందే ఇల్లందలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించే స్థలాన్ని క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన 20 నెలల్లో దేశంలోనే ఏ ప్రభుత్వం చేపట్టలేని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి విజయవంతంగా అమలు జరుగుతున్న నేపథ్యంలో ఈ యాత్ర ద్వారా ప్రజలకు వివరిస్తామని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరుశాతం విజయం సాధించి తీరుతామని ఆశాభావం వ్యక్తంచేశారు.

పాదయాత్రతోనైనా 'సఖ్యత' వస్తుందా?

జనహిత పాదయాత్రతోనైనా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ఉన్న సమన్వయ లోపం గాడినపడుతుందా? అనే చర్చ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో వినబడుతోంది. ఎందుకంటే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఉమ్మడి జిల్లాలోని కొందరు ముఖ్యనేతల మధ్య ఫిర్యాదుల పర్వం సాగింది. కొన్ని కార్యక్రమాల వేదికగా వారి మధ్య అనైక్యత కూడా రచ్చకెక్కిన సంగతి తెలిసిందే. స్థానిక ఎన్నికల వేళ ఈ ముఖ్యనేతల మధ్య ఈ పాదయాత్రతోనైనా సయోధ్య కుదరాలని పార్టీ కార్యకర్తలు భావిస్తున్నారు. రెండు రోజుల పాటు వీరి పర్యటన ఉండగా మంగళవారం నిర్వహించాల్సిన వర్ధన్నపేటలోని ఫిరంగిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శ్రమదానం, ఉమ్మడి జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనాయకులతో సమావేశం అర్ధంతరంగా రద్దవడంపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అతి ముఖ్య సమావేశం ఉంటే పార్టీ ముఖ్యులతో ఎక్కువ సమయం వెచ్చించడం ద్వారా పార్టీ బలోపేతానికి ఉపయోగపడేదని క్షేత్రస్థాయి కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

సండే.. సందడి

వాజేడు: మండల పరిధిలోని చీకుపల్లి గ్రామ సమీపంలో ఉన్న బొగత జలపాతానికి ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. జలపాతం నుంచి కిందకు జాలువారుతున్న జలధారలను తిలకిస్తూ మైమరచిపోయారు. కొలనులో స్నానాలు చేయడంతో పాటు సెల్ఫీలు, దిగుతూ సందడి చేశారు.

ఎంబీఏలో ప్రవేశాలకు పరీక్ష

విద్యారణ్యపురి: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఎంబీఏ జనరల్, ఎంబీఏ హెచ్‌హెచ్‌సీఎం (హెల్త్‌కేర్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్) కోర్సుల్లో ప్రవేశాలకు ఆదివారం పరీక్ష నిర్వహించారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఓపెన్ యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లు, సెంటర్‌ఫర్ స్టాఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటరమణ పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణులైతే అపోలో, కిమ్స్, డెక్కన్ మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. సెప్టెంబర్ రెండోవారంలో అడ్మిషన్లకు కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుందని వారు తెలిపారు.

క్లుప్తంగా

కాజీపేట మీదుగా ప్రత్యేక రైళ్లు

● సెప్టెంబర్ నుంచి ఆరు స్పెషల్ ట్రైన్ సర్వీస్‌లు



కాజీపేట రూరల్ : ప్రయాణికుల సౌకర్యార్థం దీపావళి, ఛాత్, విజయదశమి పండుగల సందర్భంగా కాజీపేట జంక్షన్, వరంగల్ మీదుగా సంత్రగచ్చి–చర్లపల్లి మధ్య ఆరు ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ ఆదివారం తెలిపారు.

ప్రత్యేక రైళ్ల వివరాలు..

సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు సంత్రగచ్చి–చర్లపల్లి (08845) ఎక్స్‌ప్రెస్ ప్రతీ శుక్రవారం సంత్రగచ్చిలో బయలుదేరి శనివారం కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటుంది. అదేవిధంగా సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు చర్లపల్లి–సంత్రగచ్చి (08846) ఎక్స్‌ప్రెస్ ప్రతీ శనివారం కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటుంది. ఈ రైళ్ల సర్వీస్‌లకు అప్‌అండ్ డౌన్ రూట్‌లో ఖరగ్‌పూర్, బాలాసోర్, బద్రఖ్, కటక్, భువనేశ్వర్, ఖుర్ద రోడ్, బెరహంపూర్, విజయనగరం, సింహాచలం, దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, రాయన్‌పాడ్, ఖమ్మం, వరంగల్, కాజీపేట స్టేషన్లలో హాల్టింగ్ కల్పించారు.

రైలు నుంచి జారి పడి యువకుడి దుర్మరణం

ఖిలా వరంగల్: రైలు నుంచి జారి పడి ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన నెక్కొండ స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ జి. సుదర్శన్ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని గోండియా జిల్లా సదక్ అర్జనీ గ్రామానికి చెందిన రామేశ్వర శ్రీరామజీ బోయర్(28) ఆదివారం ఉదయం గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఆధార్, ఓటర్ కార్డుల ఆధారంగా మృతుడి బంధువులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించి భద్ర పర్చినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఎస్ఎస్‌తాడ్వాయి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి వెంగ్లాపూర్ గ్రామంలో జరిగింది. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం... వెంగ్లాపూర్ గ్రామానికి చెందిన ఆలెం సురేశ్ (40) కుమార్తె లాస్య ఆరోగ్యం బాగా లేకపోవడంతో ములుగు ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. వెంగ్లాపూర్ దాటిన తర్వాత ఐకేపీ సెంటర్ వద్ద రాత్రి సుమారు 7 గంటల ప్రాంతంలో ట్రాక్టర్ ట్రాలీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈఘటనలో సురేశ్‌కు బలమైన గాయాలు, కుమార్తె లాస్యకు స్వల్ప గాయాలయ్యాయి. 108లో ములుగు ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యాధికారి పరీక్షించి సురేశ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆదివారం మృతుడి తల్లి ఎర్రక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

మహిళను బెదిరించిన వ్యక్తిపై కేసు

గీసుకొండ : గీసుకొండ మండలం కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ) వద్ద ఓ మహిళను బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు అయ్యింది. పోలీసుల కథనం ప్రకారం.. సంగెం మండలం చింతలపల్లి తండాకు చెందిన ఆంగోత్ కమల కేఎంటీపీలో హోటల్ నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో శనివారం రఫీక్ అనే డ్రైవర్ హోటల్‌లో టీ తాగిన అనంతరం చిట్టీపై తన ఫోన్ నంబర్ రాసి అందులో డబ్బులు పెట్టి ఆమెకు ఇచ్చాడు. ఇలా ఎందుకు ఇచ్చావని కమల ప్రశ్నించగా ఆమెను దుర్భాషలాడుతూ చంపుతానని బెదిరించాడు. దీంతో సదరు మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ సీఐ మహేందర్ ఆదివారం తెలిపారు.

మట్టి వినాయకా.. మనసా స్మరామి

● పర్యావరణాన్ని రక్షిద్దాం.. ప్రకృతిని బతికిద్దాం
● మొదలైన గణపతి నవరాత్రి ఉత్సవాల సందడి..





మట్టితో తయారు చేస్తున్న వినాయక విగ్రహాలు

కాజీపేట : వినాయక చవితి దేశవ్యాప్తంగా నిర్వహించుకునే పండుగ. ఈ క్రమంలో నవరాత్రి వేడుకలకు ఇప్పటికే విగ్రహాల తయారీలో కళాకారులు నిమగ్నమయ్యారు. ఎలాంటి విగ్రహం ఏర్పాటు చేసుకోవాలి. ఎంత ఎత్తులో ఉండాలని గణపతి మండపాల నిర్వాహకులు సన్నాహాలు మొదలుపెట్టారు. ఇంత వరకు బాగానే ఉంది. మరి ఎలాంటి విగ్రహాన్ని ఎంచుకుందాం..? పర్యావరణానికి ఎటువంటి హాని కలగకుండా ఉండే మట్టి విగ్రహాలకు ప్రాధాన్యమిద్దామా..? ప్రకృతికి విఘాతం కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన వాటికి మొగ్గు చూపుదామా..? నిర్ణయించుకోవాల్సిన సమయం వచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులు మట్టి గణనాథుల వైపు ఆసక్తి చూపించాలని ఆశిస్తూ 'సాక్షి' ప్రత్యేక కథనం.

మొదలైన చవితి సందడి..

ఇతర రాష్ట్రాలకు చెందిన కళాకారులు మట్టితో సైతం భారీ విగ్రహాలను తయారు చేస్తున్నారు. నాలుగేళ్లుగా వందల సంఖ్యలో పూర్తి సహజ రంగులతో రూపొందించి, వాటిని విక్రయిస్తూ తమవంతుగా పర్యావరణాన్ని కాపాడుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మహారాష్ట్ర, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి కుటుంబ సభ్యులతో వలస వచ్చి వినాయక విగ్రహాల తయారీలో నిమగ్నమవుతున్నారు. మట్టి వినాయకులనే పూజించాలని కొంత కాలంగా ప్రచారం చేస్తుండడంతో సొంతంగా తయారు చేసి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. మొదట పదుల సంఖ్యలో తయారు చేసి పండుగ రోజు విక్రయించే వారు. రెండేళ్ల నుంచి వారు చేస్తున్న మట్టి వినాయకులకు అనూహ్య స్పందన రావడంతో విగ్రహాల తయారీ విపరీతంగా పెరిగిపోయింది. చవితికి కొన్ని నెలల ముందుగానే పూర్తి సమయాన్ని విగ్రహాల తయారీకి కేటాయిస్తున్నారు. 4 నుంచి 9 అడుగుల ఎత్తును పెంచుకుంటూ విగ్రహాలను తయారు చేయడం ప్రారంభించారు. కొనుగోలు చేయడానికి ప్రజలు సైతం ముందుకు వస్తున్నారు. ఇక అప్పటి నుంచి మండపాల నిర్వాహకులు ఆర్డర్ ఇచ్చిన కొలతల ప్రకారం విగ్రహాలు రూపొందిస్తున్నారు. మహారాష్ట్రలోని సిరొంచ నుంచి ప్రత్యేకంగా మట్టిని తీసుకొచ్చి రసాయనాలు లేని రంగులు వేస్తూ అందంగా తీర్చిదిద్దుతున్నారు.

మట్టి గణపతినే పూజిస్తున్నాం..



ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో కలిగే అనర్థం ఎలా ఉంటుందో ఇప్పటికే ప్రజలకు తెలుసు. ఇలాగే కొనసాగితే భవిష్యత్ మరింత అధ్వాన పరిస్థితిని ఎదుర్కొవాల్సి వస్తుంది. జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తుండటం బాగానే ఉన్నా.. ఎంత మంది మట్టితో తయారు చేసిన వాటినే పూజిస్తున్నారనేది ముఖ్యం. మూడేళ్లుగా మా కాలనీలో మట్టి గణపతినే కొనుగోలు చేసి పూజిస్తున్నాం.

– అరూరి సాంబయ్య, విష్ణుపురి

గూడ్స్ షెడ్‌కు భారీగా ఎరువులు

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్ గూడ్స్‌షెడ్‌కు ఆదివారం కోరమండల్ కంపెనీకి చెందిన ఎరువులు భారీగా వచ్చాయి. 20:20:0:13 రకం 1844 మెట్రిక్ టన్నులు, 15:15:15 రకం 526 మెట్రిక్ టన్నులు, 16:20:0:13 రకం 319 మెట్రిక్ టన్నులు చేరాయి. కోరమండల్ ఎరువులను రికార్డుల ప్రకారం వ్యవసాయ అధికారులు విజ్ఞాన్, రవీందర్‌రెడ్డి పరిశీలించారు. కలెక్టర్ సత్యశారద, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ ఆదేశాల ప్రకారం కోరమండల్ ఎరువులను నిబంధనల ప్రకారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పీఏసీఎస్ గోదాంలు, ఫర్టిలైజర్ షాపులకు పంపించనున్నట్లు వ్యవసాయ అధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. అలాగే, సోమవారం ఆర్‌సీఎఫ్ కంపెనీకి చెందిన 1,319.12 మెట్రిక్ టన్నుల యూరియా నగరానికి రానుందని, దీంతో ఉమ్మడి జిల్లా రైతుల యూరియా కష్టాలు తీరనున్నాయని జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ పేర్కొన్నారు.



గూడ్స్‌కు చేరిన కోరమండల్ ఎరువులను పరిశీలిస్తున్న ఏఓ రవీందర్‌రెడ్డి

ఎస్సై శ్రీకాంత్‌పై అట్రాసిటీ కేసు నమోదు

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ ఎస్సై శ్రీకాంత్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని ఫాస్ట్ ఫుడ్‌సెంటర్ నిర్వహిస్తున్న దళిత మహిళ సంద్ర మరియమ్మ, ఆమె కుమారుడు శేఖర్‌పై ఎస్సై శ్రీకాంత్ కులం పేరుతో దూషించి చేయి చేసుకున్న ఘటనలో మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకోగా..ఆదివారం ఇరువురిపై కేసులు నమోదయ్యాయి. బాధితురాలు మరియమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీకాంత్, కానిస్టేబుల్ రాజుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుకాగా.. ఎస్సై ఫిర్యాదుతో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకురాలు మరియమ్మ, ఆమె కుమారుడు శేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేశ్ తెలిపారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు

హసన్‌పర్తి: నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఇండోర్ స్టేడియంలో రెండు రోజులపాటు నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారం ముగిశాయి. టేబుల్ టెన్నిస్ వెటరన్ క్రీడాకారుడు రమేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ, స్నేహభావం పెంపొందుతుందన్నారు. అనంతరం విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ హరీశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కిట్స్ కళాశాల ఏఓ డాక్టర్ రమేశ్‌రెడ్డి, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ మోహన్‌రావు, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్లు డాక్టర్ జైసింగ్ అజ్మీరా, సునీల్ కుమార్, కార్యనిర్వాహక సభ్యులు రవికుమార్, వెంకటస్వామి, మహేశ్, డాక్టర్ ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న అతిథులు

ముగిసిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



విజేతగా నిలిచిన వరంగల్ పురుషుల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

● చాంపియన్‌గా ఆదిలాబాద్, వరంగల్ జట్లు

రెబ్బెన: కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో కొనసాగుతున్న 71వ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయి. ఆదివారం జరిగిన ఫైనల్‌లో ఆదిలాబాద్ మహిళ జట్టు విజేతగా నిలువగా పురుషుల విభాగంలో వరంగల్ జిల్లా జట్టు విజయకేతనం ఎగురేసింది. సెమీఫైనల్‌తోపాటు ఫైనల్ పోటీలు నిర్వహించగా క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. ఫైనల్‌లో ఆదిలాబాద్ జిల్లా మహిళల జట్టు వరంగల్ జట్టుతో తలపడింది. పురుషుల విభాగంలో వరంగల్ జిల్లా క్రీడాకారులు రంగారెడ్డి జిల్లాతో తలపడ్డారు.

పోటీలతో స్నేహభావం..

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల నిర్వహణతో వివిధ జిల్లాల క్రీడాకారుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి, ఎస్వోటూజీఎం రాజమల్లు, బాల్‌బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.నారాయణరెడ్డి, ప్రధానకార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పొలం గట్లే పిల్లలకు దారి..

మరిపెడ రూరల్: మారుమూల పల్లెలు, గిరిజన తండాల్లోని పలు పాఠశాలలు పొలాల మధ్య ఉండడంతో సరైన రహదారులు లేవు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు తిప్పలు తప్పడంలేదు. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబా బాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని మంచ్యతండాలో 20 ఏళ్ల క్రితం పొలాల మధ్య పాఠశాల ఏర్పాటు చేశారు. అందులోనే అంగన్‌వాడీ కేంద్రంతోపాటు పాఠశాల నిర్వహణ కొనసాగుతోంది. అంగన్‌వాడీ కేంద్రంలో 10 మంది చిన్నారులు, ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా, గదిలో ఐదో తరగతి వరకు విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు బోధిస్తుండగా.. వరండాలో అంగన్‌వాడీ పిల్లల ఆలనా పాలన చూస్తున్నారు. కాగా దారి లేకపోవడంతో విద్యార్థులు, చిన్నారులు పొలం గట్ల మీదుగా పాఠశాలకు వెళ్లి, అదే గట్లపై మళ్లీ సాయంత్రం ఇంటికి వస్తున్నారు. ఉపాధ్యాయులు సైతం తమ ద్విచక్రవాహనాలను రోడ్డుపై నిలిపి, గట్ల వెంబడి పాఠశాలకు వెళ్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పొలం గట్లు తడిసిపోయి పిల్లలు జారి కింద పడిపోతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు తక్షణమే అదనపు గదులతో పాటు, రహదారిని ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, మంచ్యతండా వాసులు కోరుతున్నారు.



పొలం గట్టుపై నడుస్తున్న విద్యార్థులు

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ కేవలం 11 లక్షల రూ. పెట్టుబడితో ప్లాట్ కొనండి 15 సం.లలో 60 లక్షల ఆదాయం పొందండి & 15 సం.ల పాటు లగ్జరీ రిసార్ట్‌లో ఫ్రీ మెంబర్‌షిప్ పొందండి. సంప్ర॥ 9014370005.
[SCA25007365]

WANTED

■ క్రిస్టల్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్ L.B నగర్ వరంగల్ యందు పనిచేయుటకు సూపర్‌వైజర్ కావలెను. అర్హత: 10th క్లాస్, జీతం నెలకు 7 వేలు. సంప్ర॥ 9966493673, 9849827928.
[SCA25007599]

WANTED TEACHERS

■ Wanted Teachers to teach English upto 8th Class. Vandana High School, Shivanagar, Warangal. Cell: 9849943040.
[SCA25007503]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/–
అదనపు లైను రూ॥ 60/– మాత్రమే
5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్ : 9705748198, 9866574715
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 7702221602
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి

హన్మకొండ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేపట్టనున్న సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని ఆ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యాం యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని సంఘం కార్యాలయంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రంజిత్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని చెప్పిందన్నారు. బీసీలకు రిజర్వేషన్ల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లును ఆమోదం తెలిపేలా ఒత్తిడి పెంచాలన్నారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా ముందుకు వెళ్తే యుద్ధం చేస్తామన్నారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోల్తి సారయ్య, నాయకులు బాబు యాదవ్, సొగాని శ్రీనివాస్, బగ్గి రాజు, సనత్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్యాం యాదవ్

ఆర్ట్స్ కళాశాల డిగ్రీ సెమిస్టర్ల పరీక్షల ఫలితాల విడుదల

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్)లో బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ మొదటి, రెండు, ఐదో (బ్యాక్‌లాగ్) సెమిస్టర్ పరీక్షల ఫలితాలను ఆదివారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి విడుదల చేశారు. ఈ పరీక్షలకు మొత్తం 1,014మంది విద్యార్థులు హాజరుకాగా అందులో 355మంది (35శాతం)ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, ఆ కళాశాల పరీక్షల నియంత్రణాధికారి సుధీర్, అధ్యాపకులు గిరిప్రసాద్, శ్రీదేవి, నహిదాపర్వీన్, జితేందర్,రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి, అధ్యాపకులు

ఉపాధ్యాయుడు రాజేందర్‌పై క్రిమినల్ కేసు

భూపాలపల్లి అర్బన్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు పెండ్యాల రాజేందర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ ప్రకటనలో తెలిపారు. రాజేందర్ మూడు రోజుల క్రితం పాఠశాలలో విద్యార్థులు తాగే ఆర్వో ప్లాంట్‌లో క్రిమిసంహారక మందు కలిపినట్లు నిర్ధారించామని పేర్కొన్నారు. ఎంఈఓ దేవానాయక్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేట్టారు. ఇందులో ప్రస్తుత ప్రత్యేకాధికారి వెంకటనర్సయ్యపై వ్యక్తిగత విభేదాల కారణంగా పాఠశాల ప్రతిష్ఠను దెబ్బతీసేలా రాజేందర్ కుట్ర పన్నినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. కుట్రలో భాగంగా ఈ నెల 21వ తేదీన రాత్రి తాగునీటి ట్యాంకులో హానికర పురుగులమందు కలిపినట్లు విద్యార్థులు గమనించి పోలీసులకు తెలిపారన్నారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టి రాజేందర్ తాగునీటిలో విషం కలిపారని నిర్ధారించినట్లు తెలిపారన్నారు.

దర్యాప్తు కొనసాగుతోంది..

తాగునీటిలో క్రిమిసంహారక మందు కలిపిన ఘటనలో ఉపాధ్యాయుడు రాజేందర్‌ను అరెస్ట్ చేసినట్లు భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల ప్రాణాలకు ముప్పు కలిగించే ఈ తరహా దారుణ చర్యలకు పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేలేదన్నారు. ఈ కేసులో ఇతరుల ప్రమేయం ఉందా అనే అంశాన్ని పరిశీలిస్తున్నామని, దర్యాప్తు పూర్తి స్థాయిలో కొనసాగుతోందన్నారు. సమావేశంలో సీఐ నరేశ్‌కుమార్, ఎస్సై సాంబమూర్తి పాల్గొన్నారు.



రాజేందర్ అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ సంపత్‌కుమార్

కాజీపేట రైల్వేడిపోకు పూర్వ వైభవం

● దసరా కానుకగా కొత్త పోస్టులు ఇండెంట్
● 190 ఎల్‌పీ, ఏఎల్‌పీ పోస్టులకు గ్రీన్‌సిగ్నల్
● రన్నింగ్ స్టాఫ్ క్రూ రివ్యూలో నిర్ణయం
● ఫలించిన ఎంపీ, ఎమ్మెల్యే, రైల్వే నాయకుల కృషి



కాజీపేట రైల్వే రన్నింగ్ డిపో

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లోని రన్నింగ్ డిపోకు త్వరలో పూర్వ వైభవం రానుంది. ఐదేళ్ల క్రితం వెలవెలబోయిన కాజీపేట జంక్షన్‌కు మహర్దశ పట్టనుంది. ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన రన్నింగ్‌స్టాఫ్ రివ్యూలో రైల్వే అధికారులు కాజీపేట రన్నింగ్ డిపోను దృష్టిలో పెట్టుకొని దసరా కానుకగా కొత్తగా పోస్టులు ప్రకటించారు. 90 గూడ్స్ అసిస్టెంట్ లోకో పైలెట్లు, 90 అసిస్టెంట్ లోకో పైలెట్లు, 10 ప్యాసింజర్ అసిస్టెంట్ లోకో పైలెట్లను కలుపుకొని కొత్తగా 190 పోస్టులను అధికారులు అలాట్‌మెంట్ చేసినట్లు రైల్వే ట్రేడ్ యూనియన్ నాయకులు ఆదివారం తెలిపారు. గతంలో కాజీపేట జంక్షన్ నుంచి డోర్నకల్, విజయవాడ రైల్వే డిపోలకు రైల్వే క్రూ లింక్‌లు, లోకోపైలెట్లను తరలించి ప్రాధాన్యతను తగ్గించారని పేర్కొన్నారు. ఇప్పుడు కొత్త పోస్టులతో ఆ సమస్య లేకుండా పోయిందని వివరించారు. కాజీపేట నుంచి క్రూ లింక్‌లను తరలించి ఈ ప్రాంతాన్ని నిర్వీర్యం చేయవద్దని గతంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, రైల్వే నాయకులు రైల్వే జీఎం, డీఆర్ఎంపై ఒత్తిడి తెచ్చారు. దీంతో నాటి రైల్వే జీఎం కాజీపేటకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కాజీపేటకు అలాట్ చేసిన కొత్త పోస్టులతో మొత్తం కాజీపేట రైల్వే రన్నింగ్ డిపో 720 మంది స్టాఫ్‌తో సికింద్రాబాద్ డివిజన్‌లో పెద్ద డిపోగా మారనుంది. బెల్లంపల్లి, డోర్నకల్‌తోపాటు ఇతర రైల్వే డిపోల్లో పనిచేస్తూ కాజీపేటకు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్న వారు ఇక్కడికి బదిలీపై వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

కాజీపేట రైల్వే డిపోపై ప్రత్యేక శ్రద్ధ..

వయా కరీంనగర్ మీదుగా భీమవరం–నాందేడ్‌కు సెప్టెంబర్ 5వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఎక్స్‌ప్రెస్ రైలుకు కాజీపేట రైల్వే డిపోకు చెందిన క్రూవారే (లోకోపైలెట్, అసిస్టెంట్ లోకోపైలెట్, ట్రెయిన్‌మేనేజర్–గార్డు) పనిచేసే అవకాశం ఉందని, అప్ అండ్ డౌన్ రూట్‌లో ఈ రైలుకు ఆరుగురు రన్నింగ్ స్టాఫ్ పనిచేస్తారని రైల్వే నాయకులు తెలిపారు. భవిష్యత్‌లో కరీంనగర్ మీదుగా నిజామాబాద్, నాందేడ్ వరకు ఎక్కువ రైళ్లను ప్రవేశపెట్టి నడిపించే క్రమంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు కాజీపేట రైల్వే డిపోపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారని పేర్కొన్నారు.

రైల్వే నాయకుల హర్షం..

కాజీపేట రైల్వే డిపోకు కొత్తగా సికింద్రాబాద్ రైల్వే అధికారులు 190 ఎల్‌పీ, ఏఎల్‌పీల పోస్టులను మంజూరు చేసినందుకు కాజీపేట రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ లోకో రన్నింగ్ బ్రాంచ్ చైర్మన్ పాక రాజ్‌కుమార్, కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ లోకోరన్నింగ్ బ్రాంచ్ సెక్రటరీ పి.సాయికుమార్ హర్షం వ్యక్తం చేశారు.

కట్నం కోసం భార్యను హత్య చేసిన భర్త

● వరంగల్ హంటర్ రోడ్డులో దారుణం

ఎంజీఎం: అదనపు కట్నం కోసం భార్యను భర్త హత్యచేసిన ఘటన ఆదివారం రాత్రి వరంగల్ హంటర్ రోడ్డులో జరిగింది. మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ కథనం ప్రకారం.. ఆటో డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్న గణేశ్‌కు నాలుగు నెలల క్రితం మహబూబాబాద్ జిల్లా వీరారం గ్రామం బాల్య తండాకు చెందిన గౌతమి(21)తో వివాహం జరిగింది. కట్నకానుకల కిందట రూ.20 లక్షలు, 150 గజాల స్థలాన్ని ఇచ్చారు. వీరు హంటర్‌రోడ్డులో నివాసం ఉంటున్నారు. గౌతమికి ఊపిరి ఆడడం లేదని గణేశ్.. గౌతమి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. ఈలోగా గౌతమి మృతి చెందింది. అదనపు కట్నం కోసం గణేశ్ తమ కూతురిని గొంతు నులిమి చంపాడని మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శవ పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి ఎన్‌సీడీ రీ స్క్రీనింగ్

ఎంజీఎం: హనుమకొండ జిల్లాలో సోమవారం నుంచి నాలుగో దశ సంక్రమిత వ్యాధులు (ఎన్‌సీడీ) రీ స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ అప్పయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు ఆయా ప్రాంతాల్లో పర్యటించి కుటుంబ సభ్యుల వివరాలు, బీపీ, షుగర్, కేన్సర్, ఇతర సమస్యలు గుర్తిస్తారని పేర్కొన్నారు. ముందుగా తయారు చేసిన చెక్‌లిస్ట్ ప్రకారం కొన్ని ప్రశ్నలు అడిగి తెలుసుకుంటారని వివరించారు. పరీక్షలకు పట్టణ ప్రాంత ప్రజలు, అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్న వారు సహకరించాలని కోరారు. ఈ స్క్రీనింగ్‌లో భాగంగా ఆయుష్మాన్ భారత్‌కార్డు కూడా అప్‌డేట్ చేస్తారని తెలిపారు.

గోదావరి జలాలు తీసుకొస్తా

● 'పనుల జాతర'లో రూ.3.69 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
● స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



వేలేరులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వేలేరు: వచ్చే యాసంగి నాటికి పైప్‌లైన్ పనులు పూర్తి చేసి గండిరామారం రిజర్వాయర్ నుంచి వేలేరు మండలానికి గోదావరి జలాలు తీసుకొచ్చి మండలంలోని రైతులకు సాగునీరందిస్తానని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం మండలంలోని మల్లికుదుర్ల, సోడాషపల్లి, పీచర, శాలపల్లి, లోక్యాతండా, వేలేరు గ్రామాల్లో పనుల జాతర–25 కార్యక్రమంలో భాగంగా రూ.3 కోట్ల 69 లక్షల 35 వేల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈసందర్భంగా వేలేరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలానికి సంబంధించిన ఎంపీడీఓ కార్యాలయ నిర్మాణానికి మరో రూ.2.50 కోట్లు నిధులు పెంచి ఇవ్వాలని ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. 15 ఏళ్ల ఎమ్మెల్యేగా పని చేసిన ఓ వ్యక్తి పాలనను గాలికి వదిలి పదవిని అడ్డం పెట్టుకుని పదవులు, పనులు, పథకాలు అమ్ముకుని అక్రమంగా సంపాదించాడని విమర్శించారు.

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

వేలేరు మండలం మల్లికుదుర్లలోని ఎస్సీ కాలనీలో రూ.25 లక్షలు, సోడాషపల్లిలో రూ.25 లక్షలు, పీచరలో రూ.33.20 లక్షలు, శాలపల్లిలో రూ.16.60 లక్షలు, వేలేరులో రూ.45.55 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. శాలపల్లిలో రూ.12 లక్షలు, లోక్యాతండాలో రూ.12 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. లోక్యాతండా నుంచి పీచర వరకు రూ.2 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ పీడీ మేన శ్రీను, పీఆర్ ఈఈ ఆత్మరామ్, అగ్రికల్చర్ ఏడీ ఆదిరెడ్డి, డీడబ్యూఓ జయంతి, తహసీల్దార్ కోమి, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, పీఆర్ డీఈ శిరీష, పీఆర్ఏఈ రూపావతి, ఏఓ కవిత, ఎంపీఓ భాస్కర్, మాజీ ఎంపీపీ సమ్మిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కత్తి సంపత్, నాయకులు మల్లికార్జున్, బిల్లా యాదగిరి, సద్దాం హుస్సేన్, సమ్మయ్య, రాజిరెడ్డి, ప్రమోద్ రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, రవీందర్, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల సెస్ ఎండీగా భిక్షపతి

హన్మకొండ: సిరిసిల్ల సెస్ ఎండీగా బి.భిక్షపతిని నియమించారు. టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ రూరల్ డివిజన్ డీఈగా పనిచేస్తున్న భిక్షపతిని సిరిసిల్ల సెస్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమిస్తూ టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఎన్పీడీసీఎల్ వరంగల్ సర్కిల్ కార్యాలయంలో డీఈ టెక్నికల్‌గా పనిచేస్తున్న ఎ.ఆనందంకు వరంగల్ రూరల్ డీఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. భిక్షపతిని ఏడాది కాల వ్యవధితో డిప్యుటేషన్‌పై సిరిసిల్ల సెస్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.